వంతెనపైనే ఇసుక కుప్పలు



మహిమలూరు నుంచి ఆత్మకూరుకు వెళ్లే మార్గంలో బొగ్గేరు వంతెనపై పేరుకుపోయిన ఇసుక

మండలంలోని మహిమలూరు సమీపంలో ఉన్న బొగ్గేరు వంతెనపై ఇసుక కుప్పలు పేరుకుపోవడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ బొగ్గేరును కొందరు ఇష్టానుసారం తవ్వి సొమ్ము చేసుకుంటుండడంతో ఈ దుస్థితి ఏర్పడింది. కాగా బొగ్గేరు నుంచి వంతెనపైకి నేరుగా వెళ్లేందుకు వారు కొత్త రహదారిని కూడా నిర్మించుకోవడం విశేషం. పైగా ఆ ఇసుకను తరలించే క్రమంలో బొగ్గేరు వంతెన నిండా ఇసుక కుప్పలు పడిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతే కాకుండా గాలి కారణంగా ఇసుక లేచి వాహనదారుల కళ్లలో పడుతున్నాయి. సంబంధిత అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. – ఆత్మకూరురూరల్

కూలేందుకు సిద్ధంగా..

- ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

మండలంలోని ఉలవపాళ్ల జాతీయ రహదారి సమీపంలో దాబా వెనుక ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ స్తంభం గుండా ఉలవపాళ్ల గ్రామానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. ముఖ్యంగా రైతులు వ్యవసాయ మోటార్లకు వినియోగించే మూడు లైన్ల విద్యుత్ దీనిగుండానే వస్తుంది. ఈ స్తంభం విరిగిపడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా నూతన స్తంభం వేయాలని కోరుతున్నారు. – దగదర్తి



శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్లో) స్తంభంలో ఏర్పడిన పగుళ్లు

పది నెలలకే ఛిద్రం



రావులకొల్లు, చెర్లోయడవల్లి మధ్యలో ఛిద్రమైన తారురోడ్డు

ఆత్మకూరు పట్టణం నుంచి నాగులపాడు వెళ్లే వైపు రోడ్డు పది కాలాల పాటు భద్రంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందపడ్డారు. కానీ పట్టుమని పది నెలలు కూడా కాక ముందే పలు చోట్ల రోడ్డు ఛిద్రమై కాంట్రాక్టర్ల కక్కుర్తిని బయటపెట్టింది. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఈ రోడ్డు నిర్మాణం నిర్మాణం జరిగింది. అయితే రోడ్డుకు ఇరువైపులా అంచులకు సరిపడా మట్టిని తోల లేదు. ఫలితంగా అనేక చోట్ల రోడ్డు ధ్వంసమవుతోంది. సంబంధిత అధికారులు సత్వరం స్పందించి కనీస మరమ్మతులు చేయకుంటే కొద్దికాలంలోనే ఈ రోడ్డు నామరూపాలు లేకుండా పోతుంది. – ఆత్మకూరురూరల్

క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ తల్లి

కలిగిరి: మండలంలోని పోలంపాడులో ఉన్న పోలేరమ్మ తల్లి తిరునాళ్లు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పోలంపాడు, వీరారెడ్డిపాళెం, పెద్దకొండూరు, అయ్యప్పరెడ్డిపాళెం నాలుగు గ్రామాల ప్రజలు ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో తొలిరోజు ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సూడిమాను గుంత తీశారు. అనంతరం పోలంపాడులోని అమ్మవారి పుట్టినిల్లు అయిన బొల్లినేని వారి ఇంట పూజలు చేసుకుని పెద్దకొండూరులోని చాకలివారి ఇంటి వద్దకు తీసుకొచ్చి ఘటమునకు పూజించి గూడా వారి ఇంటి వద్ద పూజా కార్యక్రమాలు జరిపారు. రాత్రి అయ్యప్పరెడ్డిపాళెంలో అమ్మవారి గ్రామోత్సవం చేపట్టారు.

పరామర్శ



సీతారామపురం: వైఎస్సార్‌సీపీ నేత, సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ సభ్యుడు పీసీ అల్లూరురాజు తమ్ముడి కుమారుడు ఆకస్మికంగా మృతిచెందడంతో వారి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. సీతారామపురంలోని వారి నివాసంలో కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, జిల్లా యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ ముద్దు కృష్ణమరాజు ఉన్నారు.

ఉత్తమ వైద్యుడిగా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మురళీధర్

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చాకలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్న మురళీధర్‌కు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారిణి సుజాత పురస్కారాన్ని అందజేశారు. వైద్యాధికారిగా రోగులకు ఉత్తమ సేవాలు అందించినందకు పురస్కారం వరించింది. ఈ క్రమంలో ఆయనకు స్థానిక వైద్యారోగ్య సిబ్బంది ఆదివారం అభినందనలు తెలిపారు.

సంగంలో చిరుజల్లులు



సంగం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో సంగం మండలంలో ఆదివారం చిరుజల్లులు కురుసింది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో 18.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పేదల ఇళ్లకు గ్రహణం

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తలపెట్టిన జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలకు కూటమి ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చాక వంద రోజుల ప్రణాళిక రూపొందించి గృహ నిర్మాణాలు పూర్తి చేసి పేదల సొంతింటి కల నెరవేరుస్తామని చేసిన ఆర్భాటపు ప్రకటనలు నీటిమూటలుగా మిగిలాయి.

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అసంపూర్తిగా మిగిలిన నివాసాలు
- పట్టించుకోని అధికారులు



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని జగనన్న కాలనీలో అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడు ప్రాంతాల్లో గత ప్రభుత్వ కాలంలో ఆరు జగనన్న కాలనీ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. పీఎంఏవై పథకం కింద 2,284 మందికి ప్లాట్లను కేటాయించి గృహాలను మంజూరు చేశారు. అనంతరం కొందరు పునాదుల వరకు, మరికొందరు గోడల వరకు నిర్మాణాలు చేసుకున్నారు. కొందరు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసిన నగదుకు తోడు మరి కొంత నగదుతో నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసంపూర్తి నిర్మాణాల ఇళ్లకు అదనపు సాయాన్ని ప్రకటించి కొందరికి మాత్రమే వర్తింపజేసింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయోనని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

కలెక్టర్ ఆనంద్ ప్రతివారం నిర్వహించే రివ్యూ సమావేశంలో జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నా లాభం లేకుండాపోతోంది. మండల స్థాయి అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణానికి చొరవ చూపేలా అవగాహన కల్పిస్తే కొందరైనా ముందుకొచ్చి నిర్మాణాలు పూర్తి చేసుకుంటారు. అయితే ఆ పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

వంద రోజుల ప్రణాళిక ఏమైందో?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వంద రోజుల ప్రణాళిక రూపొందించి గృహ నిర్మాణాలు పూర్తి చేసి పేదల సొంతింటి కల నెరవేరుస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేశారు. శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు చేయిస్తామని గతంలో ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు నీటిమూటలుగా మిగిలాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. శ్రావణ మాసం మరో పది రోజుల్లో పూర్తికానున్న తరుణంలో కూటమి మాటలు ఒట్టిమూటలేనన్న విషయం మరోసారి రుజువైంది.



శిథిలావస్థకు చేరిన బోరు

- దీనిపై గృహ నిర్మాణ శాఖ డీఈని సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పనుల్లో ప్రగతి ఏదీ?

గత ప్రభుత్వ కాలంలో ఒక్కో లబ్ధిదారునికి సెంటు స్థలం కేటాయించి (ఆరు అంకణాలు) రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందజేసిన విషయం తెలిసిందే. కొందరు లబ్ధిదారులు సొంతంగా ఇళ్లు నిర్మించుకో లేక పోవడంతో కొందరు కాంట్రాక్టర్లను నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఇందులోనూ పలువురు లబ్ధిదారుల వద్ద ప్రభుత్వం అందజేసే గృహ నిర్మాణ బిల్లు కంటే (1.80 లక్షలు) అదనంగా రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసి అసంపూర్తిగా ఇళ్లు నిర్మించి చేతులెత్తేశారు. దీంతో లబ్ధిదారుల పరిస్థితి దిక్కుతోచకుండా ఉంది. ఇలా మొత్తం ఇళ్లలో 30 శాతమైనా పనులు పూర్తి కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మౌలిక వసతుల్లో భాగంగా ఓ బోరును గతంలో కాలనీ వద్ద వేసినా అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది.

ప్రోత్సాహక నగదు అందజేత



అల్లూరు: అల్లూరుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో పాఠశాల స్థాయిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదును ఆదివారం అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన సాయి శరణ్యకు రూ.5 వేలు, రాచగిరి సందీప్‌కు రూ.3 వేలు, ఈగ సాయిచైతన్యకు రూ.2 వేలను వేమూరి శేషగిరిరావు, లలితాంబ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రాము, మధుమతి, గాయత్రి, దివాకర్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, హెచ్ఎం శ్రీనివాసులు, మేడా శ్రీనివాసులురెడ్డి, యానాదిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వరికుంటపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో జరిగిన చిందే నవీన్–పుష్పాంజలి వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, నాయకులు, ప్రజలతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



కావలి (జలదంకి): కావలి వెంగళరావు నగర్‌లోని విశ్వోదయ సేవా సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు డీఆర్ జ్ఞాపకార్థం నిత్యావసర సరుకులు, నగదును అందించారు. న్యూ అగర్వాల్ ఐకేర్ సెంటర్ నేత్ర వైద్యుడు బొబ్బాల మోహన్– సౌజన్య హాజరై, వీటిని పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. డీఆర్ విశ్వోదయ సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బొట్లగుంట వర్సెస్ ఎమ్మెల్యే

కావలి (జలదంకి): ముసునూరుకు చెందిన టీడీపీ నేత బొట్లగుంట శ్రీహరినాయుడుకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలకు విభేదాలు ముదిరినట్లు తెలుస్తోంది. ముసునూరులో మున్సిపల్ దుకాణం కోసం చెలరేగిన వివాదం టీడీపీకి చెందిన ఇరు వర్గాల వారు ఫిర్యాదుల వరకు వెళ్లింది. ముసునూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో రెండు దుకాణాలను స్థానిక టీడీపీ నాయకుడు బొట్లగుంట శ్రీహరి నాయుడు, అతని అనుచరుడు దాదాపు ఐదేళ్ల క్రితం లీజుకు తీసుకున్నారు. అయితే ఇటీవల ఒక దుకాణం ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో దానిని తమకు ఇవ్వాలని ముసునూరుకు చెందిన కన్నం కృష్ణ, శ్రీధర్‌లు శ్రీహరినాయుడును అడిగారు. అయితే ఆ షాపును మురళీ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడని, అతను వద్దంటే మీకు ఇస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఆ షాపు తాళాలను వెంగయ్య అనే వ్యక్తి వద్ద నుంచి కృష్ణ బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో శ్రీహరినాయుడు అతని కుమారుడు శశి, మురళీ, వెంకటేశ్వర్లు తదితరులు కృష్ణ ఇంటికి వెళ్లి తాళాలు ఇమ్మని అడిగారు. దీంతో వారి మధ్య వివాదం చెలరేగింది. తరువాత వివాదం సర్దుమణిగిన అనంతరం కృష్ణ, అతని సోదరుడు శ్రీధర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో మురళీ, వెంకటేశ్వర్లును ఎస్సై తిరుమలరెడ్డి స్టేషన్‌కు తరలించారు. అంతేకాక శ్రీహరినాయుడును కూడా స్టేషన్‌కు రావాలని చెప్పడంతో అతను స్టేషన్‌కు వచ్చి మురళీ, వెంకటేశ్వర్లును పంపించే వరకు కదలనని చెప్పడంతో సీఐ రాజేశ్వరరావు ఇరువర్గాల వారితో మాట్లాడి అందరినీ పంపేశారు. దీంతో శ్రీహరినాయుడును ఎమ్మెల్యే అరెస్టు చేయించారనే వార్తలు వ్యాపించాయి.

దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ



ఆదురుపల్లిలో ప్రభుత్వ స్థలంలో ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

- టీడీపీ నేత నిర్వాకం

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం ఆదురుపల్లి ప్రధాన రహదారి సమీపంలో స్థానిక టీడీపీ నాయకుడు ఏకంగా 30 అంకణాలకు పైగా ప్రభుత్వ స్థలాన్ని తన సోదరికి ప్రభుత్వాధికారులు ఎప్పుడో ఇచ్చారని చెప్పుకుంటూ ఆక్రమించాడు. దీనిపై గతంలోనే అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడ్రోజులు సెలవులు రావడంతో శని, ఆదివారాల్లో ఆక్రమిత ప్రభుత్వ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని చేయించాడు. సర్వే నంబర్ 596లోని 31 అంకణాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇది నెల్లూరు–కలువాయి మార్గంలో పెట్రోలు బంకు సమీపంలో ఉంది. ప్రధాన రహదారిలోని స్థలం కావడంతో దీనివిలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని అంచనా. కాగా సదరు టీడీపీ నాయకుడు మరో వ్యక్తికి దానిని విక్రయించినట్లు, దగ్గరుండి ప్రహరీ నిర్మాణం చేయించేందుకు పూనుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు దీనిపై సరైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై చేజర్ల మండల తహసీల్దార్ బి.మురళిని సంప్రదించగా ఆక్రమిత స్థలం గురించి తనకు ఇప్పుడే తెలిసిందని, సోమవారం వీఆర్వోను పంపి పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధం



మాట్లాడుతున్న రెహనాబేగం

ఉదయగిరి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో ఆమె ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు, లోకేషలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట తప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇంతవరకు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి పదోన్నతులు కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 5జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా తమ ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, నాయబ్, రజియా తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో నిర్వాహకులు



ఆత్మకూరు: ఉపకార వేతన పత్రం అందజేత

దుత్తలూరు: దుత్తలూరులోని సీడ్స్ సంస్థ కార్యాలయంలో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పదో తరగతిలో ప్రతిభ చాటి ఆర్థికంగా వెనుకబడిన 97 మంది విద్యార్థులకు సీడ్స్, యువ అన్ స్టాపబుల్ సహకారంతో రూ.2 లక్షల చొప్పున ఉపకార వేతనాల మంజూరు పత్రాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీడ్స్ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళేశ్వర్‌రెడ్డి తన సొంత గ్రామంలో ఇలాంటి సంస్థను నెలకొల్పి ఎందరో పేద విద్యార్థులకు బాసటగా నిలిచి ఆదుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీడ్స్ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సబితారెడ్డి, రైతు ప్రాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ కోఆర్డినేటర్ రవిచంద్ర, రిటైర్డ్ ప్రొఫెసర్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఎంఈఓ వెంగయ్య, సీడ్స్ సంస్థ సీఈఓ పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక భరోసా

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన సాయిధనూష్ గత 10వ తరగతి ఫలితాల్లో 560కు పైగా మార్కులు సాధించడంతో దుత్తలూరుకు చెందిన సీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు, మాజీ ఐఏఎస్ రామిరెడ్డి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి రూ.2 లక్షల ఉపకార వేతనానికి సంబంధించిన మంజూరు పత్రం ఆదివారం అందజేశారు.

యూరియా ఎక్కడయ్యా?

- వెంటాడుతున్న కష్టాలు



యూరియా బస్తాలు

ఉదయగిరి: కూటమి పాలనలో రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభం కావడంతో పలు రకాల పైర్లు సాగు చేసేందుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. ఈ క్రమంలో పలు పైర్ల సాగులో కీలకంగా ఉన్న నత్రజని ఎరువు, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేల ద్వారా అన్నిరకాల ఎరువులను స్థానికంగానే రైతులకు అందించేవారు. కానీ కూటమి పాలనలో ఆర్బీకేలకు ఎరువుల సరఫరాను నిలిపివేశారు. దీంతో రైతులు ఎరువుల సరఫరా డీలర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీలర్లు యూరియా డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కాంప్లెక్స్, జింక్, గుళికలు వంటి ఇతర ఎరువులకు లింక్ పెడుతున్నారు. డీలర్లు చెప్పినట్లు కొనకపోతే యూరియా లేదంటున్నారు. కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారు. బస్తా రూ.350 నుంచి రూ.400 వరకు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

కొందరికే..

ప్రభుత్వం జిల్లాలో కొన్ని వ్యవసాయ సహకార సంఘాలకు అరకొరగా యూరియా పంపిణీ చేసి రాజకీయ పలుకుబడి ఉన్న రైతులకు మాత్రమే ఇచ్చారు. సామాన్య రైతులకు నామమాత్రంగా పంపిణీ చేసి మమ అనిపించారు. మెట్ట ప్రాంతంలో వివిధ రకాల మెట్టపైర్లు సాగు చేసేందుకు నత్రజని, పోటాష్, ఫాస్పరస్ ఎరువులు వేయాల్సి ఉంది. ఈ క్రమంలో నత్రజని ఎరువు, యూరియా కొరతతో సకాలంలో పైర్లు సాగు చేసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి మెట్ట ప్రాంత రైతులకు యూరియా అందుబాటులో ఉంచాల్సి ఉంది.

బీఎస్పీ నేతల సమావేశం

ఆత్మకూరు: ఆత్మకూరులోని బహుజన సమాజ్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అడ్వైజర్ పి.కృష్ణ పాల్గొని, చేజర్ల మండలాధ్యక్షుడిగా వడ్డి ఓబులేసును, ఇన్‌చార్జి–1గా జ్యోతి మాల్యాద్రిని, ఇన్‌చార్జి–2గా మొలతాటి వెంకటరమణయ్యను నియమించి వారిని అభినందించారు. కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు దివానపు వెంకటేశ్వర్లు, బుర్ర శేషాద్రి పాల్గొన్నారు.

జంప్ రోప్‌లో విద్యార్థుల ప్రతిభ



సీతారామపురం: కావలిలోని డీబీఎస్ కాలేజీలో శని, ఆదివారాల్లో జరిగిన ఆరో సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జంప్ రోప్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక వేదగర్భ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. సంతోష్ అనే విద్యార్థి సైక్లింగ్ ఈవెంట్లో, వివిన్ అనే విద్యార్థి ఫ్రీ స్టైల్ ఈవెంట్లో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. వీరు సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల అడ్మిన్ డైరెక్టర్ కనుమర్లపూడి పవన్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

సంగం: మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం కుంకుమార్చన పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని విశేష పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అనంతరం మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





కుంకుమార్చన పూజలో మహిళలు